

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఎచ్చెర్ల : బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. యూనివర్సిటీలో ప్రతి క్లాస్ రూమ్‌లో పర్యటించి పియుసి-1 విద్యార్థుల నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులతో హాస్టల్‌లో భోజన, వసతి సదుపాయాలపై మంగళవారం ముచ్చటించారు. ఆహ్లాదకర వాతావరణంలో అన్నీ బాగున్నాయని విద్యార్థులు తెలిపారు.



విద్యార్థులతో ముచ్చటిస్తున్న జగదీశ్వరరావు

సర్దుపోటు



- వినియోగదారులపై రెండు రకాల ఇంధన ఛార్జీలు
- అదనంగా ఐదేళ్ల ట్రూ అప్ భారం
- ఒకే బిల్లులో అన్నిరకాల ఛార్జీల వసూలు
- జిల్లాపై నెలకు రూ.6 కోట్ల నుంచి రూ.8 కోట్ల భారం

శ్రీకాకుళం నగరానికి చెందిన ఎం.పద్మావతి (ఇంటి సర్వీస్ నంబరు 1311001ూ101001482)కి జూన్‌లో రూ.1069 కరెంట్ బిల్లు వచ్చింది. ఇంట్లో రెండు ఫ్యాన్లు, మూడు బల్బులు మాత్రమే వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు ఏ నెలలోనూ రూ.500కు మించి రాలేదు. అదనంగా ఏమీ విద్యుత్ ఉపకరణాలు వినియోగించకపోయినా, రెట్టింపు బిల్లు రావడం చూసి నమ్మలేకపోయారు. పైగా కరెంట్ వాడకాన్ని తగ్గించుకునేందుకు సోలార్ ఇన్వర్టర్‌ను వినియోగిస్తున్నా, బిల్లులు భారీగా రావడంపై విస్మయం వ్యక్తం చేశారు. పలాస మండలం బ్రాహ్మణతర్లాకు చెందిన గోరు బేబికి రూ.730 కరెంటు బిల్లు వచ్చింది. గత నెలలో 20 రోజులు ఇంటికి తాళం వేసి వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. మేలో రూ.890 కరెంటు బిల్లు వచ్చింది. జూన్‌లో అంతకంటే తక్కువ బిల్లు వస్తుందని అనుకున్నారు. పది రోజులకే భారీగా బిల్లు రావడంతో షాక్‌కు గురయ్యారు. బిల్లుల మోత వీరిద్దరికే పరిమితం కాలేదు. జిల్లావ్యాప్తంగా వినియోగదారులపై రెండు నుంచి మూడు రెట్ల భారం పడింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో మొత్తం 9,23,416 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 7,89,151 గృహ వినియోగ విద్యుత్ కనెక్షన్లు, 76,476 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 3,067 పరిశ్రమలకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. వీధిదీపాలు, రక్షిత మంచినీటి కనెక్షన్లు 22,154 ఉన్నాయి. ట్రూ అప్, ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిపిసిఎ) పేరుతో గతంలో ఎన్నడూ లేని రీతిలో అన్ని కేటగిరీల్లోని వినియోగదారులపైనా ప్రభుత్వం తీవ్ర భారం మోపింది. ముఖ్యంగా విద్యుత్‌శాఖ జారీ చేస్తున్న గృహ విద్యుత్ వినియోగదారులకు షాక్‌కు గురిచేస్తున్నాయి. జనానికి తెలియకుండానే మూడు రూపాల్లో బిల్లులను వసూలు చేస్తోంది. దీంతో భారీగా బిల్లులు వస్తున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 వరకు వాడిన కరెంట్‌కు యూనిట్ ఏడు పైసలు వంతున వసూలు చేస్తోంది. వినియోగదారుడు ఆ కాలంలో ఐదేళ్ల కాలంలో వినియోగించిన మొత్తం యూనిట్లను ఏడు పైసలతో హెచ్చించి వచ్చిన మొత్తాన్ని 18 వాయిదాలుగా లెక్క కడుతున్నారు. 18 నెలల పాటు బిల్లులో కలిపి వసూలు చేస్తున్నారు. గతేడాది ఆగస్టు ఒకటో తేదీ నుంచి దీన్ని అమలు చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఆ డబ్బులను వసూలు చేయనున్నారు.

వినియోగదారులపై దొంగ దెబ్బ

ఒకవైపు ట్రూ అప్ ఛార్జీలను వసూలు చేస్తున్న ప్రభుత్వం, మరోవైపు ఇంధన సర్దుబాటు ఛార్జీలనూ కలిపి బాదుతోంది. గతంలో వాడిన కరెంట్‌కు ఇప్పుడు డబ్బులు కట్టించుకోవడంపై జనంలో వ్యతిరేకత వస్తుండటంతో, విద్యుత్‌శాఖ రూట్ మార్చింది. ఏ సంవత్సరం ఇంధన సర్దుబాటు ఛార్జీలను ఆ ఏడాదే వసూలు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగానే ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిసిసిఎ)ను తెర పైకి తెచ్చింది. 2021-22 సంవత్సరంలో మూడు నెలలకో రేటు పెట్టి బిల్లులు వసూలు చేస్తోంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు యూనిట్‌కు 19 పైసలు, జులై నుంచి ఆగస్టు వరకు 61 పైసలు, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు 56 పైసలు, జనవరి నుంచి మార్చి వరకు 64 పైసలు వసూలు చేస్తోంది.

ప్రస్తుతం జారీ చేస్తున్న విద్యుత్ బిల్లుల్లో ఇవీ ఉన్నాయి. ఈ సంవత్సరానికి సంబంధించిన ఇంధన సర్దుబాటు ఛార్జీలనూ అదే బిల్లులో వసూలు చేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలకు సంబంధించి యూనిట్‌కు 40 వసూలు చేస్తోంది. ఏ నెలకు సంబంధించిన సర్దుబాటు ఛార్జీలను అదే నెల బిల్లులో కలిపి జారీ చేస్తున్నారు. అన్నిరకాల ఛార్జీలు ఒకేసారి వసూలు చేస్తుండడంతో బిల్లులు తడిసిమోపెడవుతున్నాయి.

రూ.6 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు భారం

ట్రూ అప్, ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో వసూలు చేస్తున్న బిల్లులతో జిల్లాలోని వినియోగదారులపై కోట్లాది రూపాయల భారం పడుతోంది. ఉదాహరణకు 2022 జూన్ నెల తీసుకుంటే, ఆ నెలలో జిల్లాలో 157.39 మిలియన్ యూనిట్ల కరెంట్‌ను వినియోగించారు. అందుకుగానూ ఆ నెలలో రూ.98.23 కోట్ల డబ్బులు వసూలైంది. ఈ ఏడాది జూన్‌లో 150.80 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వాడారు. అందుకు గానూ వినియోగదారుల నుంచి రూ.106.39 కోట్లు డబ్బులు వచ్చాయి. గతేడాది జూన్‌తో పోలిస్తే ఈ ఏడాది జూన్‌లో కరెంట్ వినియోగం 7.39 మిలియన్ యూనిట్లు వాడకం తగ్గినా డబ్బులు మాత్రం రూ.8.16 కోట్లు అదనంగా వచ్చింది. ఇదంతా మూడు రూపాల్లో విధిస్తున్న ఛార్జీల భారమే అన్నది స్పష్టమవుతోంది. ట్రూ అప్ ఛార్జీల వసూలు మొదలైన గతేడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకు ప్రతి నెలలో రూ.ఆరు కోట్ల నుంచి రూ.ఎనిమిది కోట్ల వరకు అదనంగా వసూలవుతోంది.

ఆఫ్‌షోర్ నిర్వాసితులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - పలాస

ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహన రావు విమర్శించారు. నిర్వాసితులకు కాలనీ ఏర్పాటు చేసి ఆరేళ్లవుతున్నా, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. కాశీబుగ్గ కోసంగిపురం జంక్షన్‌లోని ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసితుల కాలనీని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో కనీస సౌకర్యాల్లేకపోవడంతో నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని నిర్వాసితులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందన్నారు. తాగునీటి కోసం ట్యాంకు నిర్మించి కుళాయిలు ఏర్పాటు చేశారే తప్ప నీటిని ఎందుకు సరఫరా చేయడం లేదని ప్రశ్నించారు. కాలనీలో కాలువలు, రోడ్లు లేక నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని చెప్పారు. పాఠశాల, అంగన్వాడీ, సామాజిక భవనం, కళ్యాణ మండపం తదితర భవనాలు ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. కాలనీలో పాఠశాల, అంగన్వాడీ లేకపోవడంతో వేరే ప్రాంతాలకు పిల్లలను పంపించే పరిస్థితి నెలకొందన్నారు. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను ఇలానే గాలికి వదిలేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.గణపతి, నీలయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



నిర్వాసిత కాలనీని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

'నారాయణ' పుస్తకాల గదికి తాళాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరంలోని నారాయణ జూనియర్ కళాశాలలో పుస్తకాల గదికి ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం తాళాలు వేశారు. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫారాలు విక్రయించడాన్ని అడ్డుకున్నారు. విద్యార్థులకు ఇకపై పుస్తకాలు అమ్మితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కళాశాలలో పుస్తకాలు గానీ, యూనిఫారాలు గానీ విక్రయించబోమని నారాయణ కళాశాల ఎజిఎం తిరుపతిరావు లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.రాజు, బి.హరీష్, జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, రేవతి మాట్లాడుతూ విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ అండగా నిలుస్తుందన్నారు.



పుస్తక విక్రయాల గదికి తాళాలు వేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు

రుణాల మంజూరుకు ముందుకు రావాలి

- వార్షిక రుణ ప్రణాళికను అధిగమించాలి
- బ్యాంకర్లను ఆదేశించిన కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని రైతాంగానికి, మహిళలకు సకాలంలో రుణాలు మంజూరు చేసి ఆర్థిక సాధికారత సాధించేందుకు దోహదపడాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఇలకు విరివిగా రుణాలు మంజూరు చేసి, జిల్లా పారిశ్రామికంగా ఎదిగేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా లీడ్ బ్యాంకు ఆధ్వర్యాన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది రూ.14,400 కోట్ల మేర రుణాలు మంజూరు చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇందులో రూ.8,597 కోట్లు ప్రాధాన్యతా రంగానికి ఉండగా, అందులో రూ.6,780 కోట్లు రైతాంగానికి వెచ్చించనున్నట్లు చెప్పారు. రుణాలను సకాలంలో మంజూరు చేసి రైతులు, మహిళలు లబ్ధి పొందేలా చూడాలన్నారు. 2023-24 వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలు వాస్తవానికి దగ్గరగా ఉండాలన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంపై బ్యాంకు అధికారులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఈ ఆర్థిక సంవత్సరంలోనూ రైతులకు, ఎంఎస్ఎంఇలకు, మహిళలకు, విద్యా రుణాలను అధికంగా మంజూరు చేయాలన్నారు. అనంతరం 2023-24 వార్షిక రుణ ప్రణాళికను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్, డిసిసి కన్వీనర్, యుబిఐ రీజనల్ హెడ్ ఎం.వి తిలక్, నాబార్డు డిడిఎం కె.వరప్రసాద్, ఆర్‌బిఐ ఎజిఎం రెహమాన్, యుబిఐ ఆర్‌సెటి డైరెక్టర్ కె.శ్రీనివాస్, ఎస్‌బిఐ ఆర్ఎం టి.ఆర్.ఎం.రాజు, ఎపిజివిబి ఆర్ఎంలు శ్రీరాఘవేంద్ర, ఆనందరావు, వ్యవసాయ శాఖ జెడి కె.శ్రీధర్, మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా టెక్కలి పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ గ్రామాలను సందర్శించి అసాంఘిక కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించాలని మహిళా పోలీసులకు సూచించారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహనా కార్యక్రమలను నిర్వహించాలన్నారు. గంజాయి, గుట్కా, ఖైనీ తదితర నిషేధిత పదార్థాల నిల్వ, రవాణా, విక్రయాలపై దృష్టిసారించాలన్నారు. అటువంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పాత కేసుల్లో నిందితులు, ముద్దాయిలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిధిలో పాత నేరస్తులు, రౌడీషీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఎస్‌పి డి.బాలచంద్రారెడ్డి, సిఐ సూర్యచంద్ర మౌళి, ఎస్ఐ ఎల్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక



అంగన్వాడీ కార్యకర్తపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్పీకర్ సీతారాం

నీ దిక్కున్న చోట చెప్పుకో

మాజీ అంగన్వాడీ కార్యకర్తపై స్పీకర్ మండిపాటు

ప్రజాశక్తి - ఆమదాలవలస

సమస్యను చెప్పుకుందామని వెళ్లిన అంగన్వాడీ మాజీ కార్యకర్తపై శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం మండిపడ్డారు. 'నీ దిక్కున్న చోట చెప్పుకో' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని నెల్లిపర్తిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అంగన్వాడీ మాజీ కార్యకర్త శెట్టి పద్మ తనను అకారణంగా తొలగించారని స్పీకర్‌కు మొర పెట్టుకుందామని తన గడప వద్ద ఉండగా, ఆయన అక్కడకు వెళ్లకుండా ముందుకు వెళ్లిపోయారు. దీంతో ఆమె ముందుకు వెళ్లి తనను అకారణంగా తొలగించారని చెప్తుండగా, నీ దిక్కున్న చోట చెప్పుకో అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెళ్లిపోయారు. మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తున్న తననూ తొలగించారని సిద్దపురెడ్డి విష్ణమ్మ, వృద్ధాప్య పెన్షన్ ఇవ్వడం లేదని సిద్దపురెడ్డి రమణమ్మ స్పీకర్‌కు విన్నవించుకోవడానికి చూడగా ఆయన వెళ్లిపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎంపిటిసి మాజీ సభ్యులు శెట్టి నారాయణరావు మాట్లాడుతూ సమస్యలకు పరిష్కార మార్గం చూపాల్సిన స్పీకర్, ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రశ్నిస్తారనుకున్న వారి ఇళ్లకు వెళ్లకుండా స్పీకర్ వెళ్లిపోయారని విమర్శించారు. స్పీకర్ పర్యటనకు ముందురోజు వైసిపి నాయకులు ఇంటింటికీ వచ్చి ప్రశ్నిస్తే పథకాలు రద్దు చేస్తామని హెచ్చరించారని ఆరోపించారు. స్పీకర్ తమ సమస్యలను వినడం లేదని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికే తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపిలు సోమరాజు జగన్నాథం, మానుకొండ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సహకార రంగం బలోపేతానికి కృషి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సహకార రంగం బలోపేతానికి కృషి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ తొలి సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సహకార సంఘాల ఆదాయం పెంచడానికి తగిన వనరుల కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాలు సహకార సంఘాల పరిధిలోకి తీసుకురావాలని, అవసరమైన చోట కొత్త సహకార సంఘాలు రిజిస్టర్ చేయాలని ఆదేశించారు. కల్లు గీత, గొర్రెల పెంపకందారులు, నాయీబ్రాహ్మణ, చాకలి, టైలర్స్ సహకార సంఘాలు మరిన్ని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని సహకార సంఘాలు జాతీయ సహకార డేటా బేస్‌లో వారం రోజుల్లోగా నమోదు చేయాలని సూచించారు.

జిల్లాలోని 572 సహకార సంఘాల్లో ఇప్పటివరకు 388 సహకార సంఘాలను జాతీయ సహకార డేటా బేస్‌లో నమోదు చేశారని తెలిపారు. మిగిలిన 184 సహకార సంఘాలను త్వరితగతిన నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా సహకార అధికారి ఎస్.సుబ్బారావు సహకార రంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ జెడిలు కె.శ్రీధర్, ఎం.కిషోర్, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జిల్లా మత్స్యశాఖ డీడీ పి.వి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్ఇ వి.ఎస్.ఎన్ మూర్తి, డిసిసిబి అధికారులు, డివిజనల్ సహకార అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐటిఇపి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

బిఆర్ఎయు విసి ఎన్.వెంకటరావు



ప్రజాశక్తి - ఎచ్చెర్ల

డిగ్రీతో పాటు బిఇడి పూర్తి చేసేలా రూపొందించిన నాలుగేళ్ల సమకృత ఉపాధ్యాయ విద్యా కార్యక్రమం (ఐటిఇపి) ప్రవేశ పరీక్షకు 2023-24 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. యూనివర్సిటీలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిఆర్ఎయుతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 42 ఐఐటిలు, ఎన్ఐటిలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 26వ తేదీ నుంచి దరఖాస్తులను ఎన్‌టిఎ ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నామని చెప్పారు. ఇంటర్ పూర్తి చేసిన వారు ఈ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులన్నారు. దేశంలో 178 నగరాల్లో తెలుగుతో పాటు 13 భాషల్లో కంప్యూటర్ బేస్డ్ ఆధారంగా నిర్వహించే పరీక్షల ద్వారా ఈ కోర్సుల్లోకి జాతీయస్థాయిలో ప్రవేశాలు కల్పిస్తారని తెలిపారు. పరీక్షా విధానం, సిలబస్, ఎంపిక చేసుకోవాల్సిన సబ్జెక్టులు, విద్యార్హతలు, ఆన్‌లైన్ దరఖాస్తుకు రిజిస్ట్రేషన్ చేసుకునే పద్ధతి తదితర వివరాల కోసం www.nta.ac.in, ncet.samarth.ac.in వెబ్‌సైట్లను చూడవచ్చని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ వినూత్న విద్యా కార్యక్రమంతో సుశిక్షితులైన ఉపాధ్యాయులను దేశానికి అందించవచ్చని చెప్పారు. అమెరికా, కెనడా, న్యూజిలాండ్, కెనడా, సింగపూర్‌లో ఉపాధ్యాయులకు అందిస్తున్న భారీ ప్యాకేజీ ఉద్యోగాలు అందిపుచ్చుకోవడానికి ఈ కోర్సు పూర్తి చేసిన వారికి అవకాశం ఉంటుందన్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెంచాం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నాలుగేళ్ల వైసిపి పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంచగలిగామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని పెద్దపాడు- 2 సచివాలయం పరిధిలోని తంగివానిపేటలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య, వైద్యం అందించడమే అసలైన అభివృద్ధి అని చెప్పారు. ఎవరికీ పైసా లంచం ఇవ్వాల్సిన అవసరం లేకుండా పారదర్శక పాలన అందిస్తున్నామన్నారు. ప్రజాధనాన్ని సంక్షేమ పథకాల ద్వారా జగన్ వృథా చేస్తున్నారన్న చంద్రబాబు, ఆ పథకాలనే కాపీ కొట్టి తామూ ఇస్తామని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మహిళా సంఘాలకు సిఎం జగన్ బాసటగా నిలిచారన్నారు. వంశధార ఫేజ్-2 పూర్తి కావస్తోందని, గ్రామాల్లో చెరువులు ఇక ఎండే పరిస్థితులు ఉండవని చెప్పారు. తొలుత రూ.7.8 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, అంబటి శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎం.వి పద్మావతి, పైడిశెట్టి జయంతి, సాధు వైకుంఠరావు, ఎఎంసి చైర్మన్ మూకళ్ల తాతబాబు, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, తంగి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM.
O.S 7/2022

Between:
Mula Chiranjeevulu ...Plaintiff
And:
1. Mula Simhachalam ...Defendant No.1
2. Mula @ Kaviti KanakaMahalaxmi
3. Mula @ Namballa Rudraveni
...Proforma Defendants No.2 & 3.
Defendant No-2:
Mula Simhachalam, S/o. Late Pentanna, Hindu aged about 68 years, R/o.H.No.1-29, Telaga veedhi, Temburu village, Pathapatnam mandal, Srikakulam district.

NOTICE

Please take this notice that the above matter is posted to 13/07/2023 for your appearance. You are hereby directed to appear before the Hon'ble Court on **13/07/2023 at 10.30 A.M.** either in person or through an Advocate without fail and file your objections if any, otherwise the matter will be decided in your absence.

// By Court Order //

D.T.MANI CHANDAN
Advocate for Plaintiff,
Srikakulam.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీకాకుళం.
OS 93/2022

Between:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గార బ్రాంచి తరుపున బ్రాంచి మేనేజర్. --plaintiff (వాది)
And:
మార్పు మన్మధరావు --Defendant (ప్రతివాది)
To, ప్రతివాది!

మార్పు మన్మదరావు s/o చిన్న సన్యాసి, హిందూ డోర్ నెంబరు 1-20, మెయిన్ రోడ్డు, గార గ్రామం, గార మండలం, శ్రీకాకుళం జిల్లా.
పై నెంబరు దావాలో వాది, ప్రతివాది పై దావా వేసియున్నారు. ప్రతివాది బాకి ఉన్న డబ్బులు వడ్డీతో కలిపి రూ॥4,24,793/- రాబెట్టుకొను నిమిత్తం ప్రతివాదిపై వాది పై నెంబరు దావా వేసియున్నారు. సదరు దావా 04-07-2023 తేది నకు వాయిదా వున్నది. కావున సదరు 04.07.2023 తేదిన ఉదయం 10.30 గం॥ లకు పై పెర్కొన్న కోర్టువారి ఎదుట మీరు స్వయంగా హాజరై మీ యొక్క సమాదనం తెలియచేయగలరు. లేనియెడల,పై నెంబరు దావాలో విషయములు మీ పరోక్షమున విచారించి కోర్టు వారు తీర్మానము చేయుదురని తెలియచేయడమైనది.

(కోర్టు ఆర్డర్ ప్రకారం)

మామిడి క్రాంతి
వాది తరుపు న్యాయవాది,
ద్వారకానగర్ శ్రీకాకుళం.

శ్రీకాకుళం
తేది. 28.06.2023



పతకం సాధించిన రేవంత్, కిరణకుమారి

మార్షల్ ఆర్ట్స్‌లో క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి- రణస్థల

రాష్ట్రస్థాయి పెన్ కాక్ సిలాట్ (మార్షల్ ఆర్ట్స్) క్రీడా పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు సత్తా చాటారు. చిత్తూరు జిల్లా పుత్తూరు వేదికగా ఇటీవల పెన్ కాక్ సిలాట్ ఎనిమిదో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ బాలబాలికల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్ర నలు మూలల నుంచి 300 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా చెందిన క్రీడాకారులు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో 13 మంది పతకాలు సాధించారు. పది మంది బంగారు, మరో ముగ్గురు రజత పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఈ ఏడాది ఆగస్టు నెలలో కేరళలో నిర్వహించనున్న సౌత్‌జోన్ నేషనల్స్ పెన్ కాక్ సిలాట్ రాష్ట్ర పియన్షిప్ పోటీలకు నేరుగా ఎంపికయ్యారు. ఇదిలా ఉండగా క్రీడాకారులు రాణింపుపై పెన్ కాక్ సిలాట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రేగిడి దయామయ, ప్రధాన కార్యదర్శి నక్క లక్ష్మణనాయుడు అభినందించారు.

వివిధ కేటగిరీల్లో సబ్‌జూనియర్స్ విభాగంలో రణస్థలానికి చెందిన నెమలపురి రేవంత్, బడారి ప్రణవి, రెడ్డి జ్ఞానచంద్, సూర్య, జూనియర్స్ విభాగంలో పి.వంశీకృష్ణ, చిట్టూరి పవన్ సాయిగణేష్, లంక లతీష్ చైతన్య, మామిడి పవన్ సాయి, సీనియర్స్ విభాగంలో నేతింటి నాగమణి, నేతింటి ఇంద్రజ, నక్క లక్ష్మణ్ నాయుడు బంగారు పతకాలు సాధించారు. కె.హరీష్, ఎం.చైతన్య, జి.రామ్మోహనరావు రజిత పతకాలతో మెరిశారు.

సోంపేట : మండలంలోని మామిడిపల్లికి చెందిన లండ కిరణ్‌కుమారి ఇటీవల తిరుపతిలో జరిగిన 12వ జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా కిరణ్ కుమారి వ్యక్తిగతంగా బంగారు పతకం సాధించినట్లు తండ్రి సూర్యనారాయణ, కోచ్ సురేంద్ర తెలిపారు. ఈ మేరకు ఆమెను గ్రామస్తులతో పాటు జెడ్‌పిటిసి తడక యశోద, సర్పంచ్ తడక జోగారావు అభినందించారు.



రెండోసారి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు

హెచ్చరిక బోర్డు ఫ్లెక్సీ చించివేత

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని బోరుభద్రలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఅవుట్‌లో పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డుని గుర్తు తెలియని వ్యకులు సోమవారం రాత్రి చించివేశారు. అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఫ్లెక్సిని చించివేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. విషయం తెలుసుకొన్న పంచాయతీ కార్యదర్శి కె.వినోద్ మళ్లీ లేవుట్‌లోని వేరొక చోట హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. హెచ్చరిక బోర్డును చించితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో రియాల్టర్‌కు నోటీసులు ఇచ్చినా పట్టించుకోకుండా లేఅవుట్‌లో పనులు కొనసాగించడంపై రెండో సారి నోటీసులను జారీ చేశామని తెలిపారు.

బాహుదా వంతెన నిర్మాణ పనులకు బ్రేక్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని బాహుదా నదిపై ఉన్న రోడ్డు వంతెన కుప్పకూలి రెండు నెలలు పూర్తవుతుంది. అయినా నిర్మాణ పనులు ముందుకు కదలడం లేదు. మే 3న ఉదయం పెద్ద గ్రానైట్ ట్రైలర్ లారీ వెళ్లడం ఒక్కసారిగా లారీతో సహాయ వంతెన కుప్పకూలిడిపోయింది. దీంతో అప్పటో రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న వెంటనే స్థానికంగా ఉన్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్, ఎమ్మెల్యే అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, అధికారులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. కలెక్టర్ రావడంతో వంతెన పునరుద్ధరణ చేపట్టి తాత్కాలిక వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. వెంటనే రూ.42 లక్షలు నిధులు కూడా మంజూరు ప్రకటించారు. కలెక్టర్ చొరవ తీసుకోవడంతో వంతెన నిర్మాణం పనులు వేగవంతంగా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు టెండర్‌కు పిలిచారు. దీంతో పనులు వేగవంతమవుతాయని అనుకున్నారు. ఈ సమయంలో వంతెన నిర్మాణానికి అంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసే అధికారం కలెక్టర్‌కు లేదని సాంకేతిక కారణంతో పనులు నిలిపివేశారు. తుపాను కారణంగా కూలిపోయిన వాటికి కలెక్టర్ నిధులు ఇవ్వడానికి అధికారం ఉందని, కానీ భారీ వాహనంతో కూలిన వంతెన నిర్మాణానికి అంత పెద్ద మొత్తం నిధులు మంజూరు చేసే అధికారం లేదని కారణంగా బాహుదా వంతెన నిర్మాణ పనులు తాత్కాలికంగా నిలిచినట్లు సమాచారం. తాజాగా తక్కువ నిధులు కేటాయిస్తూ మరోసారి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. వర్షాలు, వరదలు రాకముందే వంతెన నిర్మాణ పనులు పూర్తవుతుందని అనుకున్న ప్రజలకు నిరాశే మిగిలింది. దీంతో మండల, మున్సిపాలిటీ ప్రజల రాకపోకలు సాగించేందుకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. బెల్లుపడా, అచ్చంపేట మీదుగా రాకపోకలు సాగించడంతో సమయం వృథా అవుతుంది. ఇప్పటికే చాలా వ్యాపారాలు తగ్గుముఖం పట్టిందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు చేపట్టేలా కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


పనులకు నోచుకోని బాహుదా వంతెన


రణస్థలం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

'జగనన్న సురక్ష'తో సత్వర పరిష్కారం

రణస్థలం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా తక్షణ పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జగనన్న సురక్షపై అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అర్హులై ఉండి ఏ ఒక్కరూ లబ్ధి అందకుండా మిగిలిపోకూడదన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నెల రోజుల పాటు నిర్వహించేందుకు అర్హులందరికీ సంక్షేమ పథకాలు, 11 రకాల ధ్రువపత్రాలను ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.

వజ్రపుకొత్తూరు : జగనన్న సురక్ష విజయవంతంపై ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి నువ్వలరేవు, డోకులపాడు సచివాలయాలను సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, సర్పంచ్, ఎంపిటిసి ప్రతినిధులు వడ్డి కరుణాకర్, కె.డిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. బెల్లుపడ సచివాలయంలో 12,13 వార్డుల వాలంటీర్లతో మంగళవారం జగన్నన్న సురక్ష విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలంటీర్ల క్లస్టర్‌కు సంబంధించి ఇళ్లకు వెళ్లి సర్వే చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులను తీసుకుని మీ సచివాలయం పరిధిలో పెట్టబోతున్న కాంప్ సెక్రటరీలకు అందజేయాలనారు. పరిశీలించిన తరువాత ఉచితంగా ధ్రువపత్రాలను పొందవచ్చని తెలిపారు.కౌన్సిలర్ తాడి ఆదిరెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ సాలీనా ఢిల్లీ, కౌన్సిలర్ ప్రతినిధులు బుడుపు త్రినాథ్, నీలాపు ఢిల్లీ, ఎంఎల్ఒ సందీప్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : వచ్చే నెల నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహశీల్దార్ పి.సరోజని సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో మంగళవారం సమీక్షించారు. అలాగే రెవెన్యూపై పలు సూచనలు చేశారు. అనంతరం నేలబొంతు, అనంతగిరి గిరిజన ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించి నాణ్యతతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు వడ్డిపెట్టాలని ఆదేశించారు. ఈ పథకం సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. అలాగే జగనన్న విద్యా కానుకలు అందరికీ అందేలా చర్యలు చేపట్టాలన్నారు.

జి.సిగడాం : జనగన్న సురక్షలో భాగంగా వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవాలని ఎంపిడిఒ కె.నిశ్చల సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పించారు.


ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి


వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు

దళితులపై దాడులను అరికట్టాలి

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో దళితులపై, మైనార్టీలపై, మహిళలపై, జర్నలిస్టులపై, చిన్నారులపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, అరాచకాలు, హత్యలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి కోరారు. కలెక్టరేట్‌లోని జిల్లా ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి పంచరెడ్డి మురళీకృష్ణను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం హయాంలో ఎక్కడికక్కడే అన్యాయాలు, అక్రమాలు, దాడులు నిత్యకృత్యంగా మారాయని విమర్శించారు. నిజాయితీగా ఉన్న వారిపైన, ప్రశ్నిస్తున్న వారిపైన భౌతిక దాడులకు దిగడం నిత్యకృత్యమవుతోందన్నారు. ఇటీవల రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థిపై కొంతమంది పెట్రోల్ పోసి నిప్పంటించి హతమార్చడం ప్రజలను తీవ్రంగా కలచి వేసిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి డోల శంకరరావు, సహాయ కార్యదర్శి కొమర భాస్కరరావు, సమితి సభ్యులు నిమ్మడ కృష్ణమూర్తి, ఎఐటియుసి జిల్లా గౌరవ సలహాదారులు చిక్కాల గోవిందరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, రైతు సంఘం జిల్లా నాయకులు పి.అప్పారావు పాల్గొన్నారు.

లైన్‌మేన్ మృతి


ఎర్రయ్య (ఫైల్)

జి.సిగడాం : మండలంలోని వెలగాడ పంచాయతీ జూనియర్ లైన్‌మేన్ ఇ.ఎర్రయ్య (35) విద్యుత్ స్తంభం పైనుంచి జారిపడి మంగళవారం మృతి చెందారు. మదుపాంకు చెందిన ఎర్రయ్య వెలగాడలో విలేజ్ ఎలక్ట్రికల్ జూనియర్ లైన్‌మేన్‌గా పనిచేస్తున్నారు. బ్రేక్ డౌన్ సవరించే నిమిత్తం విద్యుత్ స్తంభం ఎక్కాడు. స్తంభంపై విద్యుత్ వైర్లను సవరిస్తుండగా కాలు జారి కిందకు పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ పి.శంకరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడికి భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ట్రైకార్ నిధుల మళ్లింపు అన్యాయం

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గిరిజనులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రైకార్ నిధులను లా నేస్తం పథకం కిందకు మళ్లించడం సరికాదని, దీనివల్ల గిరిజనులకు అన్యాయం జరుగుతుందని ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరహాల కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టికల్ 275 ప్రకారం గిరిజనుల అభివృద్ధికి నిధులు కేటాయించారని అన్నారు. వీటి ద్వారా గిరిజనులకు సబ్సిడీపై రుణాలు, యంత్రాలు, రోడ్లు, తాగునీటి సదుపాయాలు కల్పిస్తూ... నిరుద్యోగులకు, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం వెచ్చించాల్సి ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ నిధులను విడుదల చేయడం లేదు సరికదా గిరిజనుల సంక్షేమానికి వెచ్చించే దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో గిరిజన సంతతికి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్నా నోరు మెదపకపోవడం దారుణమన్నారు. ఆదివాసీల సంక్షేమానికి సంఘం తరుపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

కేశవరావుకు నివాళి

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని ఉప్పారపేటకు చెందిన సిపిఎం జిల్లా మాజీ నాయకులు పిండి కేశవరావు ప్రథమ వర్ధంతి వేడుకలు మంగళవారం తన స్వగృహం వద్ద నిర్వహించారు. ముందుగా కేశవరావు చిత్రపటానికి సిపిఎం జిల్లా నాయకులు నిమ్మక అప్పన్న పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాటం చేశారని గుర్తు చేశారు. అలాగే రైతుల కోసం, వంశధార నిర్వాసితుల కోసం పోరాటం చేశారని అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తంగుడు తెల్లన్న, పాపమ్మ, ఎం.అప్పలనర్సీ, ఎం.లక్ష్మణరావు, ఎం.ఎర్రన్న, పి.విజయ, పి.పాపమ్మ, పి.అచ్చమ్మ, ఎం.పద్మ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జీడికి మద్దతు ధర కల్పించాలి

ప్రజాశక్తి- సోంపేట

80 కేజీల జీడి బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని ఎపి రైతు సంఘం మామిడిపల్లిశాఖ సభ్యులు పి.కృష్ణమూర్తి, పి.ముకుందరావు కోరారు. ఈ మేరకు మామిడిపల్లి సచివాలయం-2 కార్యదర్శి కల్పనకు కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వర్తింపజేయాలన్నారు. అలాగే సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి చర్యలు తీసుకుని రైతులకు చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు సింహాచలం, జోగారావు, తాతారావు, పాపారావు పాల్గొన్నారు.

జనసేనలోకి చంద్రమోహన్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్ కళ్యాణ్

పొందూరు: భీమవరంలో నిర్వహించిన జనసేన పార్టీ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమక్షంలో మండలంలోని బురిడికంచరాంకు చెందిన ఆల్ ఇండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ పార్టీలో మంగళవారం చేరారు. ఈయనతో పాటు మండలంలోని రాపాకకు చెందిన ఎపి తూర్పు కాపు సంక్షేమ సంఘం సభ్యులు ముల్లు హరినాథ్‌లకు జనసేన పార్టీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

30న మిగుల సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని నందిగాంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులం కళాశాలలో మిగుల సీట్లు భర్తీకి ఈ నెల 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు గురుకులాల కో-ఆర్డినేటరు ఎన్.బాలాజీనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో జూనియర్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి పరీక్ష రాసి సీటు రాని విద్యార్థినులు ఇంటర్మీడియట్ ఎంఇసి, సిఇసి తరగతుల్లో చేరేందుకు నందిగాంలోని గురుకులంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సిఇసిలో 34, ఎంఇసిలో 39 సీట్లు ఖాళీగా ఉన్నట్టు పేర్కొన్నారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 6281905023, 9177788124, 08942-279926, 9652290407 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.


సన్మానిస్తున్న రామ్మూర్తిరాజు

వరుణ్‌కు సన్మానం

ప్రజాశక్తి- పోలాకి

ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలచిన బోర వరుణ్ చక్రవర్తికి ఎస్‌బిఐ తరుపున రీజనల్ మేనేజర్ టి.రామ్మూర్తిరాజు అభినందనలు తెలిపారు. విజయవాడ ఎస్‌బిఐ సిజిఎం ఆదేశాలు మేరకు ఎస్ఐ, అధికారులు తోటాడ గ్రామానికి చేరుకుని వరుణ్ చక్రవర్తి స్వగృహంలో మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ఉండి జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించడం మనందరికీ గర్వకారణమని అన్నారు. విద్యార్థుల ఉన్నత చదువులు చదువుకోవడానికి ఎస్‌బిఐ రుణ సౌకర్యం కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలాకి బ్రాంచ్ మేనేజర్ ఈ.సంధ్యారాణి, రమణమూర్తి, షణ్ముఖరావు, వరుణ్ తల్లిదండ్రులు రాజ్యలక్ష్మి, రాజేంద్రనాయిడు, పెదనాన్న మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

మీనాకుమారికి అభినందనలు

ప్రజాశక్తి- టెక్కలి/రూరల్

మండలంలోని మోదుగువలసకు చెందిన కొర్లాపు మీనాకుమారిని నీట్ ప్రవేశ పరీక్షకు సంబంధించిన శిక్షణ ఇప్పించి ఆనంతరం డాక్టర్ కోర్సు చదవడానికి అయ్యే ఖర్చును తామే భరిస్తామని గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు మోదుగువలస గణపతిరావు కుమార్తె డాక్టర్ స్వర్ణలత, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రాజేష్‌లు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి ఇంటి వద్ద మీనాకుమారిని మంగళవారం అభినందించారు.

అనంతరం దాతలు స్వచ్ఛందంగా ప్రకటిస్తూ... మీనాకుమారికి రూ.లక్ష నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. మీనాకుమారి టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ బైపిసి చదివి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సంపాదించడంపై ఇటీవల సిఎం జగన్ అణిముత్యాలు నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, జడ్‌పిటిసి దువ్వాడ వాణిలు, సర్పంచ్ గొండేలా సుజాత, వైసిపి నాయకులు కిల్లి రామ్మోహనరావు, సత్తారు సత్యం, మోదుగువలస దుర్యోధనరావు, కిరణ్‌కుమార్, కృష్ణ పాల్గొన్నారు.



మీనాకుమారికి చెక్కును అందజేస్తున్న నాయకులు

కృషితోనే ఉన్నత శిఖరాలు సాధ్యం



విద్యార్థిని సన్మానిస్తున్న సూరిబాబు

శ్రీకాకుళం అర్బన్ : విద్యారంగంలో విద్యార్థులు తమ విద్యా సంవత్సరంలో అనుకున్న లక్ష్యాన్ని ఛేదించడానికి కృషి ఒక్కటే తార్కాణమని శర్వాణి విద్యా సంస్థల వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు అన్నారు. ఆలిండియా నీట్ ర్యాంకర్ వరుణ్ చక్రవర్తి, జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో ర్యాంకులు సాధించిన శర్వాణి పూర్వ విద్యార్థి పి.సూర్యతేజ, శర్వాణి, పదో తరగతి టాపర్లు కె.హేమాన్య, పి.హైమావతిలకు నగరం లోని శర్వాణి విద్యాలయం ప్రాంగణంలో మంగళ వారం దుశ్శాలువ కపి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల గ్రామం నుంచి జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాన్ని అం దుకున్న వరుణ్ చక్రవర్తి కృషి అభినందనీయమని అన్నారు. విశ్రాంత డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని స్ఫూర్తి పొందాలన్నారు. సంస్థ డైరెక్టర్ సాయిరాణి, పద్మావతి విద్యాసంస్థల డైరెక్టర్ పి.దుర్గాప్రసాద్, శర్వాణి విద్యా సంస్థల కరెస్పాండెంట్ అంధవరపు ఆంజనేయులు పాల్గొన్నారు.

యాదవులకు టిడిపి అండ

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

యాదవులకు టిడిపి ఎల్లవేళలా అండగా ఉంటుందని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక స్థానం కల్పిస్తామని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో జిల్లా టిడిపి యాదవ సాధికార సమితి ఆధ్వర్యాన యాదవ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రాజకీయాల్లో వైసిపి ప్రభుత్వం కుల ప్రస్తావన తీసుకువచ్చి విభజించి పాలించే విధంగా రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితి దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఒకే తాటి పైకి వచ్చి గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు టిడిపిని బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం గౌతు శిరీషకు యాదవల సంఘం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యాదవ సాధికారత కమిటీ ఎన్నుకున్నారు. నియోజకవర్గం కమిటీ కన్వీనర్‌గా దాసరి తాతారావు, పలాస మండల కన్వీనర్‌గా వంకల కూర్మారావు, కార్యదర్శిగా రాపాక పురుషోత్తం, వజ్రపుకొత్తూరు కన్వీనర్‌గా ఉంగ భుజంగరావు, కార్యదర్శిగా కోనారి కిరణ్, మందస మండలం కన్వీనర్‌గా సాలిన మాధవరావు, కార్యదర్శిగా పత్రి లక్ష్మణరావు, జిల్లా కమిటీ సభ్యులుగా మామిడి తాతారావు, అంబటి కృష్ణమూర్తిలను నియమించారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సాధికార కమిటీ అధ్యక్షుడు ఇప్పిలి జగదీష్, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్ రావు, కొరాయి వాసు, ఎస్.నవీన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గౌతు శిరీష

పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదు

శ్రీకాకుళం అర్బన్ : తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉన్నా శ్రీకాకుళం నియోజకవర్గంలో టిడిపి ఇన్‌ఛార్జి గుండ లక్ష్మీదేవి పార్టీ కార్యక్రమాలకు తమను ఆహ్వానించడం లేదని, మమ్మల్ని విస్మరించడం తగదని పార్టీ పరిశీలకుడు చింతల రామకృష్ణకు సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ వర్గం ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో గొండు శంకర్ వర్గంతో పరిశీలకుడు సమావేశం నిర్వహించారు. తొలుత ఉదయం సమావేశం నిర్వహిస్తున్నట్టు సమాచారం అందుకున్న నాయకులు సాయంత్రం వరకూ వేచి ఉన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వారి అభిప్రాయాలను తెలిపేందుకు అవకాశం ఇచ్చారు. గొండు శంకర్ అనుచరులు 2019లో ఎమ్మెల్యేగా పోటీ చేసి లక్ష్మీదేవి ఓటమి పాలైన తర్వాత పార్టీలో కొందరిని విస్మరించారని అన్నారు. ఓటమికి గల కారణాలు ఏమైనప్పటికీ 2014 నుంచి ఇక్కడ టిక్కెట్ మార్చమని కోరుతున్నామని, అలా జరగకపోవడం వల్లే పార్టీకి నష్టం జరుగుతోందని వివరించారు. పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి సమర్థ వంతమైన నాయకత్వాన్ని సమన్వయం చేసుకుని వెళ్లడంలో కొంత నిర్లక్ష్యం ఉందని వారు వివరించారు.

పౌర సరఫరాలపై ప్రత్యేక దృష్టి

కవిటి: పౌరసరఫరాలపై ప్రత్యేక దృష్టిసారించి ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని తహశీల్దార్ పి.శేఖర్ సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఒలతో, రేషన్ డీలర్లతో, ఎండియు ఆపరేటర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్వాడీలకు సమయానికి రేషన్ అందిస్తూ పూర్తిస్థాయిలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా ఎండియూ ఆపరేటర్లు, డీలర్లను సమన్వయం చేసుకుంటూ పౌరసరఫరాల్లో మండలానికి ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. అనంతరం విఆర్ఒలతో మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న భూ సర్వే, జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పూర్తిస్థాయి అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో సిఎస్ డిటి కె.సంతోష్, సీనియర్ అసిస్టెంట్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ డిఇఇ ప్రసాదరావు

జీడి పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్

పలాస : జీడి వ్యాపారులకు మెరుగైన విద్యుత్ అందిస్తామని, వారికున్న సమస్యలు తక్షణం పర్కిరించడానికి చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ డిఇఇ జి.ప్రసాదరావు తెలిపారు. స్థానిక పారిశ్రామికవాడ సాయికృప కాష్యూ పరిశ్రమలో వాణిజ్య సముదాయాలు, పరిశ్రమల విద్యుత్ వినియోగదారుల భద్రత వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ జీడి పరిశ్రమల్లో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని, దీన్ని సక్రమమైన పద్ధతి అనుసరించి వినియోగిస్తే అధిక భారం పడదని అన్నారు. పారిశ్రామికవాడ వ్యాపార సంఘం అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు జీడిపరి శ్రమదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. డెడికేటర్ ఫీడరు మంజూరు చేయాలని అభ్యర్థించడంతో తక్షణం ఆమోదించారు. దీన్ని తొందరలోనే ఏర్పాటు చేసి విద్యుత్ కష్టాలు తీరుస్తామని డిఇఇ హామీ ఇచ్చారు. కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి శ్రీనివాసరావు, పాండురంగారావు, సుధాకర్ పాల్గొన్నారు.

బాలలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు

కార్మికశాఖ అధికారి రాధాకుమారి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

14 ఏళ్లలోపు వయసు కలిగిన చిన్నారులను ఎవరైనా షాపుల్లో, ఇంట్లో, మెకానిక్ షెడ్‌ల్లో పనుల్లో పెట్టుకుంటే చట్టరీత్యా కఠిన శిక్షార్హులని, జరిమానాలు తప్పవని టెక్కలి కార్మికశాఖ అధికారి ఆర్.రాధాకుమారి, మానవ అక్రమ రవాణాశాఖ ఎఎస్ఐ డి.రమణమూర్తిలు హెచ్చరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థల అదేశాల మేరకు మండలంలోని నిమ్మాడ, కొత్తపేట, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, దండుగోపాలపురం, వడ్డీతాండ్ర, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో దుకాణాలను, మెకానిక్ షెడ్‌లను మంఘళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైన బాల కార్మికులు ఉంటే వారిని పాఠశాలలకు పంపి ఉచిత నిర్బంధ విద్య పొందేలా చూడడానికే ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అయితే ఈ తనిఖీల్లో ఎటువంటి బాల కార్మికులు లేకపోవడం మంచి పరిణామమన్నారు. కొనేళ్లుగా న్యాయసేవా సంస్థల ద్వారా నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులు వల్ల ప్రజల్లో చైతన్యం వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఒ కె.సీత, సమగ్ర బాలల సంక్షేమశాఖ స్వచ్ఛంద కార్యకర్త ఐ.జనార్థనరావు, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రాధాకుమారి



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన

అన్ని తరగతుల అభ్యున్నతికి తోడ్పాటు

నాయీబ్రాహ్మణ గర్జన సభలో మంత్రి ధర్మాన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అట్టడుగున ఉన్న ప్రజలకు తాను ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ వారి హక్కులను సాధించుకునేందుకు తోడ్పాటు అందిస్తున్నానని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని అంబేద్కర్ కళా వేదికలో మంగళవారం నిర్వహించిన నాయీబ్రాహ్మణ గర్జన సభలో పాల్గొని మాట్లాడారు. వ్యక్తి సమస్య అయినా, సామాజిక సమస్య అయినా తన దృష్టికి వస్తే పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ప్రతిఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో సిఎం జగన్ ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారని అన్నారు. 52 తరగతులకు ఆర్థికంగా ప్రయోజనం కల్పించాలన్న లక్ష్యంతో సొంత కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని అన్నారు. సమావేశంలో కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, రాజాపు హైమవతి, ఎం.వి.పద్మావతి, అంబటి శ్రీనివాసరావు, కిల్లి రామ్మోహనరావు, నాయీబ్రాహ్మణ డైరెక్టర్ ముంగటి రమణమ్మ, కె.గజపతిరావు, సింహాచలం, కృష్ణప్రసాద్, సూర్యనారాయణ, ఎస్.వి.జగన్నాథరావు పాల్గొన్నారు.


సాగు హక్కు పత్రాలను అందజేస్తున్న తహశీల్దార్ సరోజని

సాగుహక్కు పత్రాలు అందజేత

మెళియాపుట్టి: భూమి లేని, ఇతర కౌలు రైతులు తాము సాగు చేస్తున్న భూమి కోసం భూ సాగు హక్కు పత్రాలు పొందేందుకు మీ దగ్గరలో ఉండే రైతు భరోసా కేంద్రం అధికారులకు, రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ పి.సరోజని అన్నారు. మండలంలోని గొడ్డ రైతు భరోసా కేంద్రంలో మండల ఎఒ దానకర్ణుడు అధ్యక్షతన కౌలు రైతులకు భూ సాగు హక్కు పత్రాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సాగు హక్కు పత్రం ద్వారా రైతు భరోసా, ఈ పంట నమోదు ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పెదబొంతు అప్పారావు, గ్రామ రెవెన్యూ అధికారి శామ్యూల్, గ్రామ వ్యవసాయ అధికారి షణ్ముఖరావు పాల్గొన్నారు.

మంత్రి బొత్సను కలిసిన వాణి

టెక్కలి రూరల్ : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి బొత్స సత్యనారాయణను నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి కలిశారు. విజయనగరంలో మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు సమస్యలను వివరించారు. ఈమెతో పాటు ఎంపిటిసి మాజీ సభ్యులు సంపతిరావు. రాఘవరావు, కోటబొమ్మాళి పిఎసిఎస్ చైర్మన్ బాడాన మురళి, సర్పంచ్‌లు చులు మొర్రి శంకరరావు, గుజ్జు మోహన్‌రెడ్డి, ఎంపిపి ప్రతినిధి అట్లా రాహుల్ తదితరులు ఉన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి


పలాస : మాట్లాడుతున్న వెంకటరావు చిట్టి

ప్రజాశక్తి- రణస్థలం

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఇఒ-2 బి.లావణ్య సూచించారు. రణస్థలం ఎంపియుపి పాఠశాలలో ఉపాధ్యాయులతో, సిఆర్‌పిలతో, విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులను ఎంపిక చేసి, వారిలో అక్షరజ్ఞానాన్ని పెంపొందించాలన్నారు. ఎప్పటికప్పుడు బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించి, వారిలో నైపుణ్యం పెంపునకు కృషి చేయాలని సూచించారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల నుంచి పిల్లలు ఇంటికి వచ్చిన తర్వాత విడిచిపెట్టేకుండా ఇంటివద్ద చదివించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య దొరుకుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ప్రతి ఉపాధ్యాయుడూ కష్టపడి పనిచేసి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యను అందిస్తున్నారని అన్నారు. ఇప్పటికే పలు పాఠశాలలు నాడు- నేడులో భాగంగా అభివృద్ధి చెందినట్టు చెప్పారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

కవిటి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌కు బంగారుబాటలు వేయాలని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మెంబర్ పాండ శేఖర్, ఎంపిటిసి పి.నీలాచలం, విద్యా కమిటీ చైర్మన్ ఎం.కృష్ణారావు, ఇన్‌ఛార్జి హెచ్ఎం బి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పోలాకి: కష్టపడి చదివి సత్ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఎప్పుడూ ప్రోత్సాహం ఉంటుందని సుసరాం సర్పంచ్ దుంపల ఆనందరావు అన్నారు. సుసరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ.3 వేలు చొప్పున నగదు బహుమతి అందచేశారు. అనంతరం జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ లింగరాజు, హెచ్ఎం నిర్మలాదేవి, బి.శ్రీరాములు, బి.రామారావు పాల్గొన్నారు.


కవిటి : మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మణరావు


రణస్థలం : మాట్లాడుతున్న ఎంఇఒ-2 లావణ్య

జి.సిగడాం : మండల కేంద్రంలోని కెజిబివిలో ప్రిన్సిపాల్ ఉషారాణి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఇఒ అరసాడ రవికుమార్ పాల్గొని మాట్లాడారు. చక్కని వాతావరణంలోని ఉపాధ్యాయులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు.

పొందూరు: విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య అన్నారు. మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు తల్లిదండ్రులు తమ వంతు సహకారాన్ని అందజేయాలని కోరారు. కార్యక్రమంలో పిఎంసి చైర్మన్ తమ్మినేని ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలాస : పాఠశాలలో విద్యార్థులకు మంచి విద్య అందించాలని పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు వైకుంఠరావు అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్ బాడాన పుష్ప, ఎంపిటిసి తుంగాన రవణమ్మ, ఎంపిటిసి మాజీ సభ్యులు దంతం వైకుంఠరావు పాల్గొన్నారు.

కిడ్నీ రోగులకు ఇంజక్షన్ల పంపిణీ


ఇంజన్లను అందజేస్తున్న దుర్గారావు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని గొల్లమాకన్నపల్లిలో కిడ్నీ రోగులకు ఆత్మీయ ఉపాస మిషన్ ఉద్దానం స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన జనసేన నాయకులు వి.దుర్గారావు, ఎన్‌ఆర్ఐ డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ వెంకట్ డయాలసిస్ పేషెంట్లకు ఎరిత్రో పొయటిన్ ఇంజక్షన్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్దాన ప్రాంత కిడ్నీ రోగులకు ప్రభుత్వం ఇస్తున్న ఉచిత మందులు పంపిణీ నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంత రోగులకు మళ్లీ ఉచిత మందులు, ఇంజక్షన్లను తాము స్వచ్ఛంద సంస్థల ద్వారా అందిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలో డయాలసిస్ చేసుకునే రోగులకు ఉచిత రవాణా సౌకర్యం, ఎరిత్రోపోయేటెన్ ఇంజక్షన్లు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోరాటం వల్ల డయాలసిస్ సెంటర్లు, రక్షిత తాగునీరు, ఉచిత మందులు పంపిణీ గత ప్రభుత్వం అందజేసిందన్నారు. ఈ ప్రభుత్వంలో అవి అర్ధాంతరంగా నిలిపివేయడంతో కిడ్నీ వ్యాధి బాధితులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాలుగేళ్లు అవుతున్నా 200 పడకల ఆస్పత్రి ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదన్నారు. చేయకుండా ఎన్నికలు అస్త్రంగా భావించి బాధితులకు వైద్య సేవలు అందకపోవడం బాధాకరమన్నారు. ముందుగా పలాస ప్రభుత్వాస్పత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జన సైనికులు వడ్డీ ఈశ్వరరావు, లావేటి సురేష్, చలపతిరావు ధర్మారావు, హేమంత్ పాల్గొన్నారు.

మంత్రి ధర్మానను కలిసిన 'లోతుగెడ్డ'

ప్రజాశక్తి- కొత్తూరు

రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును నియోజకవర్గ నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు కలిశారు. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడు మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని దిమిలిలో కిడ్నీ సమస్యలతో చాలా మంది బాధపడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి స్పందిస్తూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈయన వెంట ఎంపిపి ప్రతినిధి సవర రమేష్ ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న వెంకటసాయి

వరి విత్తనాల పంపిణీ

జి.సిగడాం : ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటసాయి అన్నారు. మండలంలోని ఆనందపురం రైతు భరోసా కేంద్రం వద్ద మంగళవారం రైతులకు వరి విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిత్తిరి మంజు మాట్లాడుతూ విత్తనాల పంపిణీ నుంచి ధాన్యం కొనుగోలు వరకూ అన్నదాతలకు అన్నివేళలా అండగా నిలుస్తున్నారని అన్నారు. సర్పంచ్ ప్రతినిధి చిత్తిరి మోహన్ మాట్లాడుతూ ఏడాదికి రూ.13,500 పెట్టుబడి సాయాన్ని రైతు భరోసాగా ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ ముంతా హేమంత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి పైల జయరాం, మక్క సాయితేజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


న్యూట్రిషన్ కిట్లను అందజేస్తున్న డాక్టర్ అనురాధ

న్యూట్రిషన్ కిట్లు పంపిణీ

కోటబొమ్మాళి: డాక్టర్ రెడ్డీస్ సంస్థ ద్వారా జిల్లాలో ఆరు నెలలుగా రూ.700లు విలువ కలిగిన న్యూట్రిషన్ కిట్లను 595 మంది టివి రోగులకు ఉచితంగా అందజేశామని అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎన్.అనురాధ అన్నారు. కోటబొమ్మాళి సామాజిక ఆరోగ్య కేంద్రంలో 59 టిబి రోగులకు డాక్టర్ రెడ్డీస్ సంస్థ ఉచితంగా అందించిన న్యూట్రిషన్ కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది బి.సురేష్, సిహెచ్‌సి వైద్యాధికారులు, టిబి సూపర్‌వైజర్ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ ఉమ పాల్గొన్నారు.


టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి కిరణ్‌కుమార్

పశువులకు టీకాలు

కోటబొమ్మాళి: పశువులకు వర్షాకాలం ఎక్కువగా వ్యాప్తిచెందే గొంతు, జబ్బువాపు వ్యాధుల నివారణకు ప్రభుత్వం ఉచిత అందిస్తున్న టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చీపుర్లపాడు రైతు భరోసా కేంద్రం పరిధిలోని ఊడికలపాడు, దుర్గంపేట, వరహాలంపేట గ్రామాల్లో 98 పశువులకు గొంతువాపు, జబ్బ వాపు వ్యాధి నివారణ టీకాలను మంగళవారం వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవడంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని తెలిపారు. చూడి చివరి మాసాల్లో ఉన్న పశువులకు, మూడు మాసాలలోపు దూడలకు ఈ టీకాలు కూడదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి, ఎంపిటిసి బొడ్డు అప్పన్న, పశుసంవర్ధక సహాయకులు కె.ముకుందరావు పాల్గొన్నారు.

4 నుంచి వీధి వ్యాపారులకు శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆహార తయారీలో మెళకువలు నేర్చుకునేందుకు వీధి వ్యాపారులకు, మహిళలకు నగరంలోని నెహ్రూ యువజన కేంద్రంలో జూలై 4 నుంచి 8 వరకు మెప్మా ఆధ్వర్యాన శిక్షణ ఇవ్వనున్నట్టు పీడీ ఎం.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో 500 మంది వీధి వ్యాపారులు ఉన్నారని, వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. నెస్లే ఇండియా, మెప్మా సంయుక్తంగా ఈ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ శిక్షణలో హైజానిక్ ఫుడ్ పంపిణీ చేయడానికి వీలవుతుందన్నారు. టిఫిన్ తయారు చేసినవారు ఇడ్లీ, దోస, వడలు, పూరి, పుణుకులు బజ్జి, చాట్ బండి, పాని, పానీపూరి, ఫ్రూట్ జ్యూస్, ఫ్రూట్ సలాడ్ తయారీలో శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. శిక్షణలో పాల్గొన్న వారికి రూ.2 వేల విలువైన కిట్లు అందజేస్తామని చెప్పారు. అనంతరం శిక్షణ ధ్రువపత్రాలను అందజేస్తామని తెలిపారు.

విద్యార్థికి పురస్కారం

కొత్తూరు : మండలంలోని నివగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022-23లో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండల టాపర్ నిలిచిన యు.తనుజా చౌదరి 600 మార్కులకు 580 మార్కులు సాధించింది. ఈ విద్యార్థినికి పాతపట్నం రామరాజు ఛారిటబుల్ ట్రస్టు తరుపున మంగళవారం ఉన్నత పాఠశాలలో విద్యా పురస్కారం అందించారు. కార్యక్రమంలో ఎంఇఒ నిమ్మల శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు సువ్వారి నిర్మల, పి.రామరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

హుండీ ఆదాయం లెక్కింపు

జలుమూరు: శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ శ్రీకాకుళం డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన అధికారులు మంగళవారం లెక్కించారు. మూడు నెలల మూడు రోజులకు రూ.2,86,333లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.ప్రభాకరరావు తెలిపారు. ఈ లెక్కింపులో దేవాదాయశాఖ సిబ్బంది, అర్చకులు, కొమనాపల్లి సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేత్రాలపై అప్రమత్తం

రణస్థలం: నేత్రాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కళ్యాణి కంటి ఆస్పత్రి పారామెడికల్ అప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కళ్యాణి అన్నారు. రణస్థలంలోని కళ్యాణి కంటి ఆస్పత్రి ఆధ్వర్యాన మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 24 మందికి నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ నేత్ర ఆస్పత్రికి బస్సులో తరలించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ వయసు పెరుగుతున్న కొద్దీ నేత్ర సమస్యలు వస్తాయని అన్నారు. నేత్ర సమస్యలు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

వంటశాల ప్రారంభం


ప్రారంభిస్తున్న కిరణ్‌కుమార్

రణస్థలం రూరల్ : మండలంలోని పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రా ఆర్గానిక్ లిమిటెడ్ సహకారంతో నిర్మించిన మధ్యాహ్న భోజన వంటశాలను ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఒఎల్ పరిశ్రమ తమ సహకారంతో వంట గది ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. పరిశ్రమలు సహకరించి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శోభారాణి పాల్గొన్నారు.

అంబికాదేవి ఆలయం సందర్శన

ఇచ్ఛాపురం : మండలంలోని ముచింద్ర పంచాయతీ బెనిగానిపేటలో ఉన్న అంబికా దేవి ఆలయాన్ని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మంగళవారం సందర్శించారు. దీంతో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు, ఎంపిపి బొర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, చిట్టిబాబు, పిట్ట మామయ్య, ఉప్పాడ రాజారెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్లాస్టిక్ దుకాణాలపై మున్సిపల్ అధికారులు మంగళవారం రాత్రి దాడులు చేశారు. మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ ఆదేశాల మేరకు సచివాలయం ఉద్యోగులు ప్లాస్టిక్ దుకాణాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా 40 మైక్రాన్ దిగువన ఉన్న ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు.

నేడు పొందూరు మండల సమావేశం

పొందూరు : ఈ నెల 28న మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సీపాన హరిహరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కిల్లి ఉషారాణి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. విధిగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పూర్తి సమాచారంతో అన్నిశాఖాధికారులు పాల్గొవాలని సూరించారు.

కౌలు రైతులను గుర్తించాలి


చెలమయ్య

సంతబొమ్మాళి: సెంటు భూమి లేకుండా పంట సాగు చేస్తున్న కౌలు రైతులను సచివాలయంలో పరిధిలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు గుర్తించాలని తహశీల్దార్ జె.చలమయ్య సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎకరా భూమి కంటే ఎక్కువ భూమి సాగు చేస్తున్న వారిని కౌలు రైతులుగా గుర్తించాలన్నారు. రైతులకు, కౌలు రైతులకు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసిన యజమానికి ఎటువంటి నష్టం ఉండదన్నారు. భూ యజమానులు కౌలు రైతులకు సహకరించాలన్నారు. సిసిఆర్‌సి కార్డులు పొందిన కౌలు రైతులకు మాత్రమే పంటనష్ట పరిహారం అందజేస్తామని అన్నారు. మండలంలోని ఇప్పటివరకు 98 మంది కౌలు రైతులను గుర్తించామని తెలిపారు.

'సొండి'ల అభివృద్ధికి తోడ్పాటు

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలోని సొండిలను ఒబిసిలో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించేందుకు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని నవ్యాంధ్ర సొండి తరగతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎన్.కోటేశ్వరచౌదరి అన్నారు. విజయవాడలోని ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిని, బిసి చైర్మన్లను ఉత్తరాంధ్ర నుంచి వెళ్లిన బృందం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అట్టడుగన ఉన్న సొండిల అభివృద్ధికి ఈ నిర్ణయం ఎంతగానో తోడ్పాటును అందిస్తుందని పేర్కొన్నారు. సొండి రాష్ట్ర సంక్షేమ సంఘం లీగల్ అడ్వైయిజర్ రత్నాల సారథిచౌదరి, బి.రవిచంద్ర, ఆర్.దేవరాజు, పి.తిరుపతిరావు, ఎం.కిషోర్‌కుమార్, ఎం.మల్లికార్జునరావు, లాభాల విశ్వనాథ చౌదరి పాల్గొన్నారు.

కాంపాక్ట్ బ్లాక్‌లో నవధాన్యాల సాగు

ఆమదాలవలస: కాంపాక్ట్ బ్లాక్‌లో నవధాన్యాల సాగును చేపట్టినట్లు ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవిరావు తెలిపారు. మండలంలోని చేపేనపేట లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కాంపాక్ట్ బ్లాక్‌లో రైతులతో నవధాన్యాలను వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాలను ఒకే దగ్గర గుర్తించి వాటిని కాంపాక్ట్ బ్లాక్‌లుగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అందులో రైతులతో పూర్తిగా విత్తనం వేయించి మరలా విత్తనం కట్టేంత వరకూ ప్రకృతి సేద్య పద్ధతులను చేసేలా ప్రోత్సహిస్తున్నామని అన్నారు.

మహిళల శ్రమదానం

పొందూరు: గ్రామంలో మురుగునీరుతో కాలువలు నిండిపోవడంతో ఎన్నిసార్లు అధికారులకు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించులేదు. చివరకూ మహిళలంతా ఏకమై తమ కాలువలను తామే శుభ్రం చేసుకున్నారు. మండలంలోని తాడివలస పంచాయతీలో 9 నెలలుగా పారిశుధ్యం పనులు చేపట్టకపోవడంతో ఎక్కడికక్కడే మురుగునీరు నిల్వ ఉండిపోయింది. దీంతో దోమలు బెడదతో, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదంటూ పలువురు మహిళలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

పలువురికి ఆర్థికసాయం


వజ్రపుకొత్తూరు : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

టెక్కలి : పాతపట్నం మండలం తిడ్డిమికి చెందిన బాసుదొర హరికృష్ణ దంపతులకు ఆరు నెలలకే కవలల పిల్లలు పుట్టడంతో వారి ఆరోగ్య పరిస్థితి సక్రమంగా లేదు. వైద్యం చేయించడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో మండలంలోని నర్సింగపల్లికి చెందిన రాంబాబు ఛారిటబుల్ ట్రస్టు తరుపున రూ.25 వేలు నగదును మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు షణ్ముఖరావు, సభ్యులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని బైపల్లికి చెందిన కొర్లపు ఢిల్లీరావు, హారికల కుమార్తె మూడేళ్ల ఆధ్య కేన్సర్‌తో బాధపడుతుంది. ఈ చిన్నారి వైద్యం కోసం చాలా ఖర్చు అవుతుంది. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబం కావడంతో దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు స్పందించి మంగళవారం బాధిత కుటుంబానికి రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో చంటి, సంతోష్, క్రాంతి మోహన్, జోగారావు, రాజేష్, ఉష పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని సందీకొత్తూరుకు చెందిన డి.సోమేశ్ ఇటీవల మృతి చెందారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన యువత మంగళవారం ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. సోమేశ్ కుమార్తె భవిష్యత్ కోసం గ్రామస్తులంతా కలిసి రూ.56 వేలు విరాళంగా పోగుచేసి అందించారు.

కంచిలి : మండలంలోని పెద్దశ్రీరాంపురానికి చెందిన పాడి రైతు మార్పు వెంకటరమణ ఇటీవల మృతి చెందారు. పాడి రైతుల సంక్షేమ పథకంలో భాగంగా మంగళవారం విశాఖ డైయిరీ సంస్థ అందజేసిన రూ.లక్ష నగదును ఎంపిటిసి మాదిన విమల, మాజీ సర్పంచ్ రామారావుల చేతుల మీదుగా సూపర్‌వైజర్ ఈశ్వరరావు నామిని అయిన అతడి కుమారుడు శ్రీహరికి అందజేశారు.

పాలపోలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పాలపోలమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి కమిటీ సభ్యులు కృషి చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని పాలపోలమ్మ తల్లి అమ్మవారిని స్పీకర్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని అన్నారు. తన రాజకీయ జీవితం ప్రజలతో ముడిపడి ఉందని, తెరచిన పుస్తకం వంటిదని అన్నారు. తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజాభిమానమే తాను సంపాదించుకున్న గొప్ప ఆస్తిపాస్తులని అన్నారు. అవినీతి మరకలు అంటించినంత మాత్రాన అబద్ధాలు నిజమైపోవని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమేష్‌కుమార్, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు పొడుగు శ్రీను, కుసుమంచి శ్యామ్‌ప్రసాద్, దుంపల శ్యామలరావు, కూన రామకృష్ణ, మామిడి రమేష్ కుమార్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

పలాస: మున్సిపాలిటీ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నామని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.7 లక్షలు, 13 వార్డు పరిధిలో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులు రూ. 7 లక్షల వ్యయంతో మంగళవారం సిసి రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ సిసి రోడ్లు, మురుగు కాలువలు నిర్మాణం చేపడుతున్నామన్నారు. పార్టీలకతీతంగా అన్నీ వార్డులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.


శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు

కార్యక్రమంలో వైస్ చైర్మన్లు బోర కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు. పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీశంకర్, కౌన్సిలర్లు పోతనపల్లి ఉమాకుమారి, పోతనపల్లి హరి, బెల్లాల శ్రీనివాసరావు, పప్పల ప్రసాద్, సనపల సింహాచలం, కమిషనర్ నాగేంద్రకుమార్, ఎఇఇ అవినాష్ పాల్గొన్నారు.

కషాయం తయారీ

రణస్థలం : రణస్థలంలో ఇసిఆర్‌పి మేఘాలయ టీమ్‌కు ప్రకృతి వ్యవసాయ ఉత్తర కోస్తా రీజనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కృష్ణారావు, ఆర్‌టిఒ హేమసుందర్, జిల్లా మేనేజర్ పి.రేవతి కషాయం తయారీపై శిక్షణ ఇచ్చారు. బీజామృతం, జీవామృతం, పేడమూత్రం ఇంగువ ద్రావణం, నీమాస్త్రం, అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం, విష ముసిడి కషాయం, పిఎండిఎస్ విత్తనాలు, కిచెన్ గార్డెన్ విత్తనాలపై డెమోగా చేసి చూపించారు. ఇందులో కషాయాలు, ద్రావణాలు తయారీపై ఉపయోగం, తయారీ విధానంపై చర్చించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పంట పొలాలను పరిశీలించి వాటి ఉపయోగాలను, పెట్టుబడి ఖర్చులు, భూసార యాజమాన్యం పెట్టుబడి తగ్గుదల గురించి వివరించారు. కార్యక్రమంలో గోవిందరెడ్డి, శివాజీ, సూర్యనారాయణ, రాంబాబు, కృష్ణ పాల్గొన్నారు.

బీజామృతం...

జలుమూరు: విత్తనాలను బీజామృతంతో కలిపి శుద్ధి చేయడంతో భూమి నుంచి సంక్రమించే వ్యాధులను అరికట్టవచ్చునని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ టి.రమణ అన్నారు. మండలంలోని యలమంచిలిలో ప్రకృతి వ్యవసాయ రైతులకు సామూహికంగా బీజామృతం తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, యూనిట్ ఇన్‌ఛార్జి జ్యోతి, ఐసిఆర్‌పిలు అమర, కమలమ్మ పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ఎంపిపి దీప

అధికారులకు సన్మానం

ప్రజాశక్తి- బూర్జ

మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం ఎంపిడిఒలకు, ఇఒపిఆర్‌డికి ఎంపిపి కర్నేన దీప, గ్రామస్తులు మంగళవారం సన్మానించారు. ఎంపిడిఒగా పనిచేసిన సురేష్‌కుమార్ ఇటీవల బదిలీపై రణస్థలం బదిలీపై వెళ్లారు. ఇఒపిఆర్డిఇగా పనిచేస్తూ పొందూరు ఎంపిడిఒగా బదిలీపై వెళ్లిన హరినారాయణకు, ప్రస్తుతం ఇక్కడ ఎంపిడిగా విధులు నిర్వహిస్తున్న రంద్రబాబులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వ అమలు చేస్తున్న ఎన్నో పథకాలను అర్హులైన లబ్ధిదారులకు సక్రమంగా అందజేసి అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు వారిధిగా పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో టిడ్కో సంస్థ డైరెక్టర్ కె.గోవిందరావు, జెడ్‌పిటిసి రామారావు, ఎంపిటిసి గుమ్మిడి రాంబాబు, జల్లు బలరాంనాయుడు పాల్గొన్నారు.

జెవికె కిట్లు పంపిణీ

టెక్కలి రూరల్ : టెక్కలి బిసి కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యా దీవెన కిట్లు సర్పంచ్ గొండెల సుజాత మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ కమిటీతో సమావేశం నిర్వహించారు. జగనన్న పేద విద్యార్థుల కోసం సంక్షేమ పథకాలు అమలు చేసి విద్యను అందజేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి రమేష్ కుమార్, పాఠశాల హెచ్ఎం, విద్యా కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కిట్లు అందజేస్తున్న సర్పంచ్ సుజాత